

# బెజవాడకు బాసట

- ❖ మురుగుశుద్ధి కేంద్రాల నుంచి విద్యుదుత్పత్తి
- ❖ ప్రయోగాత్మకంగా విజయవాడలో
- ❖ జూన్ నుంచి ప్రారంభం ❖ ప్రపంచబ్యాంకు చేయూత

**ఈనాడు, అమరావతి**

విజయవాడను ప్రగతిపథంలో నిలిపేందుకు ప్రపంచబ్యాంకు ముందుకొచ్చింది. స్థిరమైన అభివృద్ధి సాధించే క్రమంలో కొన్ని పథకాలకు చేయూత ఇవ్వనుంది. తొలుత మురుగునీటి శుద్ధీకరణ కేంద్రాల నుంచి విద్యుదుత్పత్తికి ఒప్పందం కుదిరింది. త్వరలో పనులు మొదలుపెట్టనున్నారు. విజయవాడలోని మురుగునీటి శుద్ధీకరణ కేంద్రా(ఎస్టీపీ)ల నుంచి విద్యుదుత్పత్తి చేయనున్నారు. ప్రాథమికంగా రామలింగేశ్వరనగర్, సింగ్‌నగర్, ఆటోనగర్ ప్లాంట్లను ఎంపిక చేసుకున్నారు. శుద్ధీకరణ ప్రక్రియలో భాగంగా వెలువడే మీథేన్ వాయువు నుంచి వివిధ ప్రక్రియల ద్వారా విద్యుత్తు తయారుచేస్తారు. ఆ సరఫరాను తొలిదశలో ప్లాంటు నిర్వహణకే వినియోగించనున్నారు. బిల్లును ఆదా చేయటంతోపాటు పర్యావరణాన్ని కూడా పరిరక్షించవచ్చని అధికారులు చెబుతున్నారు. ఎస్టీపీల కోసం

(మిగతా 19లో)

# బెజవాడకు బాసట!

**(మొదటిపేజీ తరువాయి)** ఏటా రూ.3.40 కోట్ల విద్యుత్తు బిల్లు చెల్లిస్తున్నారు.

23 నగరాల్లో... : పర్యావరణం, వాతావరణ మార్పులకు సంబంధించిన పథకం కోసం ప్రపంచబ్యాంకు విశ్వవ్యాప్తంగా 11 అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచి 23 నగరాలను ఎంపిక చేసింది. భారత్ నుంచి జైపూర్, భోపాల్, మైసూరు, విజయవాడ, గుంటూరు ఆ జాబితాలో చోటుదక్కించుకున్నాయి. కొద్దినెలల కిందట ఫ్రాన్స్, అమెరికా తదితర దేశాల నుంచి నిపుణుల బృందం విజయవాడ, గుంటూరును పరిశీలించి వెళ్లింది. వారి నివేదిక ఆధారంగా దేశ రాజధానిలో ఇటీవల సదస్సు జరిపి తమ పథకాన్ని వివరించారు. సుస్థిర అభివృద్ధికి అంతర్జాతీయ వేదిక పేరిట తాజాగా సింగపూర్‌లో ఈనెల 6 నుంచి 11 వరకు సమావేశాలు నిర్వహించి విధివిధానాలు ఖరారు చేశారు. ఒప్పందాలు కుదుర్చుకుని కార్యాచరణలోకి దిగుతున్నారు.

**ఐదేళ్లపాటు...:** ఐక్యరాజ్యసమితి పారిశ్రామికాభివృద్ధి సంస్థకు పథక నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. జూన్ నుంచి ప్రారంభమయ్యే పథకం ఐదేళ్లపాటు కొనసాగుతుంది. సాంకేతిక, ఆర్థిక సహకారం సమకూర్చుతారు. ఒకవంతు రూ.6.5 కోట్లు ప్రపంచబ్యాంకు నిధులు వెచ్చిస్తే ఎనిమిది భాగాలు రూ.50 కోట్లు నగరపాలక సంస్థ భరించాల్సి ఉంది. ప్రస్తుతం కొనసాగుతున్న ప్లాంటు, స్థలం, నిర్వహణ వ్యయాన్ని కార్పొరేషన్ చూపెడితే కొత్తగా నిధులు వెచ్చించాల్సిన అవసరం ఉండదు. అమృత్, స్వచ్ఛభారత్ కింద కేంద్ర నుంచి మంజూరయ్యే నిధులను ఉపయోగించుకునే వీలుంది. గుంటూరు నగరపాలక సంస్థ నుంచి ట్రాఫిక్ నిర్వహణతోపాటు మరో రెండు పథకాలను ప్రపంచబ్యాంకు పరిశీలిస్తోంది. ఈ ప్రక్రియ తుదిదశలో ఉంది.

**వ్యర్థాల నుంచి...:** వ్యర్థాలు, రసాయనాల కింద ప్రపంచబ్యాంకు మరో పథకాన్ని నగరంలో అమలుచేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. సుమారు రూ.35-40 కోట్ల అంచనావ్యయంతో చేపట్టనున్నారు. ఐదు నగరాలతోపాటు అదనంగా ఇండోర్, విశాఖల్లోనూ ఇది అందుబాటులోకి రానుంది. ఈ పథకం కింద చేపట్టే కార్యకలాపాలు ఇంకా ఖరారవలేదని వీఎంసీ కమిషనర్ జి.వీరపాండ్యన్ తెలిపారు. ఎస్టీపీల నుంచి ఎంత విద్యుత్తు ఉత్పత్తి అవుతుందనే విషయం జూన్ తర్వాత తెలుస్తుందన్నారు. వ్యయాన్ని గ్రాంటు రూపంలో అందజేస్తారని, ప్రయోగాత్మకంగా ఇక్కడే ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. నిపుణుల బృందం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారని, సలహాలు, సూచనలు చేస్తారని వివరించారు.